

వరద బాధితులకు ఆహారం

మోపిదేవి: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం నుంచి బెజవాడ వరద బాధితులకు బుధవారం ఆహారం అందించారు. వెజ్ బిర్యానీ 2,500, పులిహోర 3,500, వాటర్ 10 వేల ప్యాకెట్లను పంపించారు.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మ పంచహార తుల సేవలో దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఐఆర్ఎస్ అధికారి రవిశంకర్ బుధవారం పాల్గొన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, అన్ని యాజమాన్య పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటించినట్లు డీఈఓ తాహెరా సుల్తానా బుధవారం తెలిపారు.



న్యూస్‌రీల్

జిల్లాలో 27.3 మిల్లీమీటర్ల వర్షపాతం



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో బుధవారం 27.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గన్నవరం మండలంలో 62.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా మోపిదేవి మండలంలో 2.2 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. మండలాల వారీగా బాపులపాడు, పామర్రు మండలాల్లో 56.4 మిల్లీమీటర్లు, కంకిపాడు 48.2, నందివాడ 45.8, పెదపారుపూడి 44.0, ఉంగుటూరు 43.6, గుడ్లవల్లేరు 34.8, పెనమలూరు 34.2, గుడివాడ 30.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. బంటుమిల్లి మండలంలో 30.2 మిల్లీమీటర్లు, పెడన 29.2, ఉయ్యూరు 27.2, గూడూరు 23.8, కృత్తివెన్ను 22.2, పమిడిముక్కల 19.2, మచిలీపట్నం 16.8, తోట్లవల్లూరు 14.6, ఘంటసాల 13.2, మొవ్వ 10.8, చల్లపల్లి 7.2, కోడూరు 3.6, అవనిగడ్డ 3.4, నాగాయలంక మండలంలో 3.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

స్వామివారి హుండీ ఆదాయం రూ. 61,76,785



మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.61,76,785 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ, ఏసీ ఎస్.ఎస్.చక్రధరరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు సమక్షంలో బుధవారం స్వామివారి హుండీ కానుకలను లెక్కించామని పేర్కొన్నారు. 68 రోజులకు రూ.61.76 లక్షల ఆదాయం, పది గ్రాముల బంగారం, కిలోన్నర వెండి, 199 అమెరికన్ డాలర్లు సమకూరాయని వివరించారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ పర్యవేక్షణలో ఆలయ అధికారులు, సిబ్బంది, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.25 లక్షల సాయం

చిలకలపూడి(మచిలీపట్నం): వరద బాధితులకు కావాల్సిన సౌకర్యాలు అందించేందుకు కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ నుంచి రూ.25 లక్షలను ముఖ్యమంత్రి సహాయనిధికి పంపినట్లు బ్యాంకు ప్రత్యేకాధికారి, కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ తెలిపారు. వరద బాధితులకు సౌకర్యాలు కల్పించేందుకు, తక్షణ సహాయ చర్యలు చేపట్టేందుకు బ్యాంకు ఉద్యోగులు ఒక రోజు వేతనాన్ని రూ. 10,82,732 బ్యాంకు తరఫున రూ. 14,17,263 మొత్తం రూ. 25 లక్షలను సీఎంఆర్ఎఫ్‌కి చెక్కు ద్వారా పంపినట్లు ఆమె వివరించారు.

తేరుకోని లంకలు

- కృష్ణానదిలో తగ్గిన వరద ఉధృతి
- ముంపులోనే లంక గ్రామాలు
- 37,168 హెక్టార్లలో నీటమునిగిన పంటలు
- 2.37 లక్షల మందిపై వరద ప్రభావం
- పునరావాస కేంద్రాల్లోనే తలదాచుకున్న వరద బాధితులు
- వరదతో పోటెత్తి ప్రవహిస్తున్న బుడమేరు



కృష్ణా నది వరదతో కోతకు గురైన నాగాయలంక మండలంలోని జింకపాలెం రోడ్డు



కంకిపాడు మండలం మద్దూరులో నీట మునిగిన అరటి తోట



గన్నవరం మండలం బూతుమిల్లిపాడు వద్ద బుడమేరు ఉధృతికి నీట మునిగిన పొలాలు



నందివాడ మండలం పుట్టగుంట వద్ద పడవ ద్వారా పునరావాస కేంద్రాలకు ఆహారం తరలిస్తున్న సిబ్బంది

సాక్షి, మచిలీపట్నం: ఎన్నడూ లేని విధంగా కృష్ణమ్మ వరదతో పోటెత్తింది. రికార్డు స్థాయిలో 11.43 లక్షల క్యూసెక్కుల వరద ఉధృతితో లంకగ్రామాలను ముంచెత్తింది. పొలాలు నీట మునగడంతో రైతులు నష్టపోయారు. రోడ్లు దెబ్బతిని లంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రకాశం బ్యారేజీకి ఎగువన కురిసిన కుండపోత వర్షాలతో కృష్ణానదికి వరద పోటెత్తింది. ప్రకాశం బ్యారేజీ గేట్లు ఎత్తేశారు. బ్యారేజీ వద్ద 24.50 అడుగుల నీటి మట్టం నమోదైంది. సముద్రంలోకి 11.43 లక్షల క్యూసెక్కుల నీటిని వదిలారు. దీంతో తీర ప్రాంతాలు వణికిపోయాయి. 60 గ్రామాల ప్రజలు వరద బారిన పడ్డారు. రోడ్లు కోతకు గురవడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చెరువులకు గండ్లు పడ్డాయి. 2.37 లక్షల మంది ప్రజలపై ప్రభావం పడింది. వేల మంది నిర్వాసితులు ఇప్పటికీ పునరావాస కేంద్రాల్లోనే తలదాచుకుంటున్నారు. తీర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. వరద ఉధృతి బుధవారానికి నాలుగు లక్షల క్యూసెక్కులకు తగ్గిపోయింది. దీంతో ప్రజలు, అధికారులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. వరదతో రూ.32.88 కోట్ల మేర నష్టం వాటిల్లిందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. కృష్ణమ్మ శాంతించినా బుడమేరు ఉగ్రరూపంతో వేల హెక్టార్ల పంటలను ముంచెత్తి ప్రవహిస్తోంది. అవనిగడ్డ వద్ద పులిగడ్డ అక్విడెక్టుపై వరద తగ్గుముఖం పట్టింది. అయినా దివిసీమలోని పలు గ్రామాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. నాగాయలంక మండలంలో జింకపాలెం, గొల్లమంద గ్రామాలకు వెళ్లే కరకట్ట రహదారి కోతకు గురై నదిలోకి కుప్ప కూలింది. దీంతో ఆ గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అంచనాకు అందని పంట నష్టం

కృష్ణా వరద కారణంగా జిల్లాలో సుమారు 37,168 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు నీటమునిగాయి. 35,925 హెక్టార్లలో వరి, పత్తి 180, వేరుశనగ 328, మినుము 500, చెరుకు 235 హెక్టార్లలో ఇప్పటికీ ముంపులోనే ఉంది. ఇప్పటికీ వర్షపు నీరు పొలాల్లో ఉండడంతో పంట నష్టం అంచనా వేసేందుకు సాధ్యపడడం లేదని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. 43 ఇళ్లు దెబ్బతినడంతోపాటు 650 ఇళ్లు ముంపునకు గురయ్యాయి. వాటి కోసం రూ.5.50 లక్షలతో ప్రణాళిక సిద్ధం చేశారు.

రూ.32.8 కోట్ల నష్టంగా ప్రాథమిక అంచనా

వర్షాలు, వరదల కారణంగా రూ.32.88కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. 43 గృహాలు దెబ్బతినడంతో పాటు 650 ఇళ్లు ముంపు బారిన పడటంతో రూ.5.50 లక్షలు, మూగజీవాల మృతితో రూ.1.88 లక్షలు, ఆర్అండ్‌బీ రోడ్ల ధ్వంసంతో రూ.2 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖ రోడ్లు 35.39 కిలో మీటర్లు కోతకు గురవడంతో రూ.14.55కోట్లు, పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు, వీధి దీపాల కోసం రూ.6.42 కోట్లు, విద్యుత్ సంస్థకు రూ.42.36 లక్షల నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనాలు తయారు చేశారు. రూ.32,88,69,000తో అంచనా వేయగా తాత్కాలిక అవసరాల కోసం రూ.9,90,74,000, శాశ్వత పనులకు రూ.22.98 కోట్లు ఖర్చు చేస్తారు.

పోటెత్తిన బుడమేరు

కృష్ణా వరద ఉధృతి తగ్గుముఖం పట్టగా బుడమేరు పోటెత్తింది. నందివాడ మండలం పుట్టగుంట వద్ద మచిలీపట్నం – కల్లూరు రహదారిపై బుడమేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. బలహీనంగా ఉన్న బుడమేరు గట్లకు గండి పడకుండా ప్రజలు స్వచ్ఛందంగా పటిష్టం చేస్తున్నారు. ఉంగుటూరు మండలంలో బుడమేరు ప్రవాహం మరింత పెరిగింది. పరీవాహక గ్రామాలైన ఎలుకపాడు, వెల్దిపాడు, వేంపాడు, తరిగొప్పుల, లంకపల్లి, ముక్కపాడు ఆముదాల పల్లి గ్రామాల్లో పంట పొలాలు నీటమునిగాయి. కొయ్యగూరపాడు, వెల్దిపాడు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. వరద ప్రభావంతో బాపులపాడు మండలంలో ఆరు వేల ఎకరాల్లో వరి, వెయ్యి ఎకరాల్లో మినుము పైర్లు నీట మునిగాయి. గన్నవరం మండలంలో బుడమేరు ప్రభావం వల్ల ముస్తాబాద రైల్వే కాలనీ, జక్కులనెక్కలం, సావరగూడెం గ్రామాలు ముంపు బారినపడ్డాయి. కేసరపల్లిలో ఐదు వేల ఎకరాల వరి పైరు ఇంకా ముంపులోనే ఉంది.

పునరావాస కేంద్రాల్లో అరకొర సౌకర్యాలు

జిల్లాలో మొత్తం 50 గ్రామాలపై వరద ప్రభావం చూపడంతో 50 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 12,372 మంది తలదాచుకున్నారు. గ్రామానికి ఒకటే పునరావాస కేంద్రం ఏర్పాటు చేయడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడ కనీస సౌకర్యాలు లేవని, ఊర్లో ఉన్న జనం అంతా ఒకే కేంద్రంలో ఉంచడం అసౌకర్యానికి గురవుతున్నామని వాపోతున్నారు. భోజనం, మంచినీరు సరిపడా అందించడం లేదని పేర్కొంటున్నారు.



పుట్టగుంట వద్ద బుడమేరును పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు

బుడమేరును పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

గుడివాడరూరల్: నందివాడ మండలం పుట్టగుంట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న బుడమేరును కలెక్టర్ డి.కె.బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు బుధవారం పరిశీలించారు. తొలుత బుడమేరు పరీవాహక గ్రామాలైన పెదలింగాల, చిన లింగాల, పుట్టగుంట, ఒద్దుల మెరక, చేదుర్తిపాడు, ఎల్ఎన్‌పురం, అరిపిరాల తదితర గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు, కల్పిస్తున్న సౌకర్యాల గురించి అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వరి నీటమునిగి ఎంత మేర నష్టం వాటిల్లిందని ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ.. బుడమేరు ఉధృతితో పలు గ్రామాలు ముంపు బారిన పడ్డాయన్నారు. ముందస్తు జాగ్రత్తగా వరద ప్రభావిత గ్రామాల ప్రజలను ఇప్పటికే ట్రాక్టర్లు, పడవల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని వివరించారు. బస్సులు వెళ్లలేని మారుమూల గ్రామాల ముంపు ప్రాంతాల ప్రజలను బోట్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఐ ఎస్.ఎల్.ఆర్.సోమేశ్వరరావు, ఎస్ఐ కె.శ్రీనివాస్, డెప్యూటీ తహసీల్దార్ మల్లిక, ఆర్ఐ గణేష్, రెవెన్యూ, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. గన్నవరం మండలంలోని కేసరపల్లి వద్ద కూడా బుడమేరు వరద ఉధృతిని కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు పరిశీలించారు. ముంపు ప్రాంత ప్రజలు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు.



తోట్లవల్లూరులో వరద ముంపుతో దెబ్బతిన్న పసుపు పైరును చూపుతున్న రైతులు



నందివాడ మండలంలో ఎంఎన్‌కే రోడ్డుపై బుడమేరు ఉధృతి



పుట్టగుంటలో ప్రజలను పడవల్లో తరలిస్తున్న సీఐ



నాగాయలంక హైస్కూల్‌లో భోజనం చేస్తున్న వలస కూలీలు



వరద నుంచి బయట పడిన పులిగడ్డ అక్విడెక్టు

వరద బాధితులను ఆదుకుంటాం

మంత్రి పార్థసారథి



పెదపులిపాకలో బాధితులతో మాట్లాడుతున్న మంత్రి సారథి

పెనమలూరు: కృష్ణానది వరద బాధితులకు ప్రభుత్వం సాయం అందిస్తుందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన వరద ముంపు ప్రాంతాలైన యనమలకుదురు, పెదపులిపాక గ్రామాలలో బుధవారం పర్యటించి వరద బాధితులతో మాట్లాడారు. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో కృష్ణానదికి 13.40 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిందన్నారు. ఇదొక ప్రకృతి వైపరీత్యమన్నారు. వరద బాధితులకు పూర్తి స్థాయిలో సాయం అందించటానికి ప్రభుత్వం అన్ని విధాలా పని చేస్తుందని తెలిపారు. 200 బోట్లు, 7 హెలికాప్టర్లు, 40 డ్రోన్‌లు సహాయ చర్యల్లో పాల్గొంటున్నాయని అన్నారు. వరద ప్రాంతాల్లో బియ్యం, నూనె, కందిపప్పు అందించామని తెలిపారు. ఎన్జీవోలు ముందుకు వచ్చి బాధితులకు ఆహారం, తాగునీరు అందించి చేసిన సాయం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే బోడెప్రసాద్, తాడిగడప మునిసిపాలిటీ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు, తహసీల్దార్ గోపాలకృష్ణ, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై మళ్లీ వరద నీరు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్‌లోని రాయనపాడు స్టేషన్‌లో రైల్వే ట్రాక్‌లపై నాలుగు రోజులుగా వరత ఉధృతి కొనసాగింది. దీంతో ట్రాక్‌లు దెబ్బతిన్నాయి. ఈ కారణంగా సికింద్రాబాద్ నుంచి విజయవాడ మీదుగా అన్ని రైళ్లను రైల్వేశాఖ రద్దు చేసిన సంగతి విదితమే. ట్రాక్‌లపై వరద తాకిడి తగ్గడంతో అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ మార్గంలో ట్రైల్ రన్ నిర్వహించి రైళ్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. అయితే అనుహ్యంగా బుధవారం వరద నీరు మళ్లీ ట్రాక్‌లపై చేరడంతో మరమ్మతులకు ఆటంకం ఏర్పాడింది. ఈ మార్గంలో రైళ్లను మరోసారి రద్దు చేశారు.

రైతులు తక్షణ చర్యలు తీసుకోవాలి



ఘంటసాలలో పంటపొలాలను పరిశీలిస్తున్న సత్యనారాయణ

ఘంటసాల: వర్షపు నీరు నుంచి బయటపడిన పొలాల్లో తెగుళ్ల ఆశించకుండా రైతులు తక్షణ చర్యలు చేపట్టాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ సూచించారు. అధిక వర్షాలకు ప్రభావితమైన మండలాల పర్యటనలో భాగంగా మండలంలోని ఘంటసాల, దేవరకోటలో పంట పొలాలను సత్యనారాయణ బుధవారం పరిశీలించారు. వరి పొలంలో నీటిని బయటకు పంపి పైపాటుగా 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ చల్లుకోవాలన్నారు. కార్బండిజమ్ + మాంకోజెబ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్కలు మొత్తం తడిచేలా పిచికారీ చేసుకోవాలని సూచించారు. మచిలీపట్నం ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.నాగేంద్రరావు, ఘంటసాల కేవీకేప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.శ్రీలత, ఘంటసాల ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సత్యప్రియ లలిత పాల్గొన్నారు.

నేడు కృష్ణా జిల్లా స్థాయి గురుపూజోత్సవం

చిలకలపూడి(మచిలీపట్నం): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని జిల్లాస్థాయి గురుపూజోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు డీఈఓ తాహెరా సుల్తానా బుధవారం తెలిపారు. ఉదయం 9.30 గంటలకు జెడ్పీ కన్వెన్షన్ హాలులో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. భూగర్భ వనరులు, గనులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డి.కె.బాలాజీ, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని, ఉత్తమ సేవలు అందించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేస్తామని పేర్కొన్నారు.